# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## మంత్రి పెద్దిరెడ్డి ఇలాఖాలో... నప్రతిపక్ష నేత చంద్రబాబు

# పర్యటన ఉద్రిక్తం

**- పుంగనూరులో ప్రవేశించకుండా అడ్డుకొన్న పోలీసులు - పోలీసులపై 'దేశం' నాయకులు, కార్యకర్తలు దాడి - ఒక డిఎస్పీ, ఒక ఇన్స్‌పెక్టర్, ఒక ఎస్ఐతో పాటు 13 మంది పోలీసులకు తీవ్ర గాయాలు - దేశం దౌర్జన్యాలకు నిరసనగా నేడు జిల్లా బంద్‌కు వైకాపా పిలుపు**



ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబునాయుడు

చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త: విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో ప్రత్యర్థులుగా వున్న మాజీ సిఎం, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర భూగర్భగనులు, అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల వర్గాలు శుక్రవారం మరోసారి తలపడ్డాయి. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం చిత్తూరు ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా మదనపల్లి, పుంగనూరు, పలమనేరుల మీదుగా చిత్తూరు, పూతలపట్టుకు వెళ్ళాల్సి వుంది. రైతులను ప్రాజెక్టు నిర్మాణాలు చేపట్టకుండా వైకాపా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆరోపిస్తూ ప్రాజెక్టుల పరిశీలన పేరిట రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లి నియోజకవర్గంలో శుక్రవారం ఓ ప్రాజెక్టును పరిశీలించి పుంగనూరు, పలమనేరు, చిత్తూరు మీదుగా పూతలపట్టు వెళ్ళి అక్కడ బహిరంగ సభలో పాల్గొనాల్సి వుంది. అయితే అన్నమయ్య జిల్లాలో పర్యటన పూర్తి చేసుకొని చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పుంగనూరు, పలమనేరుల మీదుగా చిత్తూరుకు వెళ్ళాలని నిర్ణయించారు. ఈ మేరకు పుంగనూరు పట్టణంలోకి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. అయితే పోలీసులు ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును జాతీయ రహదారి మీదుగా పుంగనూరు పట్టణంలోకి ప్రవేశించకుండా నేరుగా పలమనేరుకు వెళ్ళాలని సూచించారు. అయితే తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షనేత పుంగనూరు పట్టణంలోకి వెళ్ళి తీరాల్సిందేనని పట్టుబట్టి పోలీసులతో వాగ్వివాదంకు దిగారు. ఈ వాగ్వివాదం పెరిగి పెద్దది కావడంతో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పోలీసులపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు బాష్ప వాయువు ఉపయోగించినా ఫలితం లేకపోవడంతో లాఠీ ఛార్జీ చేశారు. పోలీసులకు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు మధ్య జరిగిన దాడుల్లో 14 మంది పోలీసులకు తీవ్ర గాయాలు అయ్యాయి. చిత్తూరు దిశా పోలీస్ స్టేషన్ డిఎస్పీ రాజేంద్రప్రసాద్, చిత్తూరు క్రైం పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్, పాలసముద్రం ఎస్ఐ ప్రసాద్‌లు ఈ దాడుల్లో తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఈ దాడుల్లో మరో 11 మంది పోలీసులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన పోలీసులను వైద్యం నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకొన్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి గాయపడిన పోలీసులను పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యాధికారులను కోరారు. ఇదిలా వుండగా పుంగనూరులో ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోనే తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పోలీసులపై దాడులకు పాల్పడటం, దౌర్జన్యాలు చేయడంను నిరసిస్తూ శుక్రవారం జిల్లా బంద్‌కు జిల్లా వైకాపా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. జిల్లా బంద్‌కు అందరు పూర్తి సహకారం అందించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**ఎంతటి వారినైనా ఊపేక్షించేది లేదు : ఎస్పీ రిశాంత్‌రెడ్డి**

పుంగనూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పోలీసులపై చేసిన దాడుల్లో ఎంతటి వారినైనా ఊపేక్షించేది లేదని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు కార్యక్రమం మేరకు పుంగనూరు పట్టణంలోకి రావాల్సిన అవసరం లేదని, వారు ఇచ్చిన షెడ్యూల్ మేరకు 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసులు శాంతిభద్రతలను దృష్టిలో వుంచుకొని ప్రతతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పుంగనూరు లోకి ప్రవేశించకుండా బారికేడ్లను వుంచడం జరిగిందన్నారు. అయితే కొంతమంది అల్లరి మూకలు దౌర్జన్యంగా పుంగనూరులోకి ప్రవేశించడానికి ప్రయత్నించారన్నారు. వీరిని ఆపడానికి పోలీసులు ప్రయత్నిస్తే అల్లరిమూకలు పథకం ప్రకారం పోలీసులపై బీరు బాటిళ్ళు, కర్రలు, రాళ్ళతో పోలీసులపై దాడికి పాల్పడ్డారన్నారు. పోలీసులపై సుమారు 2 వేల మంది అల్లరిమూకలు పక్కా ప్రణాళికతో దాడికి పాల్పడ్డారన్నారు. దాడికి పాల్పడిన వారిని అడ్డుకోవడానికి పోలీసులు ముందుగా భాష్పవాయువు ప్రయోగించి అనంతరం లాఠీ చార్జీ చేయడం జరిగిందన్నారు. లాఠీ ఛార్జీ చేసిన అల్లరి మూకలు ఏ మాత్రం తగ్గకుండా పోలీసులపై ఇష్టమొచ్చినట్లు విచక్షణారహితంగా కర్రలు, రాళ్ళతో దాడి











గాయాలుపాలైన కార్యకర్తలు, పోలీసులు, తగలబడుతున్న వాహనాలు, దెబ్బతిన్న పోలీసు వాహనం, ఘర్షణ పడుతున్న కార్యకర్తలు

చేసి గాయపరిచారన్నారు. ఈ దాడుల్లో 50 మంది పోలీసులకు గాయాలు కాగా ఇందులో 13 మంది పోలీసులకు తీవ్ర గాయాలు అయ్యాయని, అలాగే 2 పోలీసు వాహనాలు ధ్వంసం చేసి నిప్పు అంటించారని ఎస్పీ పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను ఎస్పీ రిశాంత్‌రెడ్డి వెళ్ళి పరామర్శించారు.

**నేడు జిల్లా బంద్‌కు వైకాపా పిలుపు :**

ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పర్యటనలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పుంగనూరులో విధ్వంసం సృష్టించడంను నిరసిస్తూ అధికార వైకాపా శనివారం జిల్లా బంద్‌కు పిలుపు నిచ్చింది. జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ ఈ మేరకు ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలోనే తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడులకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగే బంద్‌కు వైకాపా నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# బంగారు ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా అడుగులు

**- సమస్యల పరిష్కారానికి నియోజకవర్గాల వారీగా సమీక్షలు - అధికారులు సమిష్టి విధులతో అభివృద్ధికి కంకణం - కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల సమీక్షలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు**



కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు

చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త: సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ బంగారు ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కల సకారానికి కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, రాష్ట్ర భూగర్భ గనులు, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిలు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల సమీక్షా సమావేశాల్లో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల సమన్వయంతో అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా ప్రతి గ్రామం, కుప్పం మున్సిపాల్టీల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని, ఈ సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రెవెన్యూ, హౌసింగ్‌లకు సంబంధించి ప్రజల నుండి ఎక్కువ అర్జీలు వచ్చాయని ఈ సమస్యలు పరిష్కరించడానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ భవన నిర్మాణాలను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో పశుపోషణపై అత్యధికులు ఆధారపడి వుండటంతో వీరికి రుణాలు అందించానికి డిఆర్‌డిఎ చర్యలు తీసుకోవాలన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో 23.20 కోట్ల రూపాయలతో 80 గ్రామ సచివాలయాలు మంజూరు అయితే అందులో 14.95 కోట్ల రూపాయలతో 44 భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. అలాగే 16.79 కోట్లతో 77 వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలు మంజూరు అయితే 10.83 కోట్లతో 48 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 108 పనులు గుర్తించడంతో ఈ పనులు చేపట్టడానికి 4.18 కోట్ల రూపాయల అంచనాలతో నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. చిత్తూరు ఎంపీ ల్యాడ్స్ కింద 1.38 కోట్ల రూపాయలతో 38 పనులు మంజూరు అయితే ఇందులో 9 పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఇరిగేషన్ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కృష్ణారెడ్డి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, మెప్మా పిడి రాధమ్మ, డ్వామా పిడి గంగాభవానీ, సిపిఓ ఉమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, పట్టు పరిశ్రమల శాఖ జెడి శోభారాణి, డిఎస్‌ఓ శంకరన్, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి, పమలనేరు ఆర్డీఓ శివయ్య, పుంగనూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ మాస్టర్ ప్లాన్ లేఔట్...
# రద్దు చేయాలి



మాస్టర్ ప్లాన్ లేఔట్ మ్యాప్‌ను మీడియా ముందు ప్రదర్శిస్తున్న నరసింహాయాదవ్, తదితరులు..

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 4 ప్రభాతవార్త: గతంలో 1985, 2005లో అలాగే తాను తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు మార్చి 8 2019లో ఎస్వీ యూనివర్సిటీలో రెండు మాస్టర్ ప్లాన్ రోడ్లను ఏర్పాటు చేయాలని ఆమోదించిన మాట వాస్తవమేనని, అయితే అక్కడి విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందనే అభ్యంతరాలు రావడంతో ఆ ప్రతిపాదన మానుకున్నాము. అయితే ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్‌లు మూడు మాస్టర్ ప్లాన్ రోడ్లు వేయాలని నిర్ణయించుకున్నారు. కావున ఆ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని తుడా మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నేత నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాస్టర్ ప్లాన్ లేఔట్ రోడ్లకు సంబంధించిన ప్లాన్ కాపీలను టిడిపి నాయకులతో కలిసి ఆయన మీడియా ముందు ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున ట్రాఫిక్ డైవర్ట్ చేయడానికి తాము యూనివర్సిటీలో రెండు 100 అడుగుల రోడ్లు, ఒక 80 అడుగుల రోడ్డు వేయాలని వైసిపి నేతలు చెబుతున్నారు. దీంతో విద్యార్థుల్లో పలు అనుమానాలు, భయాలు కలిగాయన్నారు. అలా కాకుండా ప్రైవేట్ వాహనాలను వర్సిటీ లోపలకు అనుమతించకుండా కేవలం విద్యార్థుల అవసరానికి మాత్రమే రోడ్ల నిర్మాణం అని చెబితే ఏ సమస్య ఉండదన్నారు. నగరంలోని అన్ని రాజకీయ పార్టీ నేతలు మాస్టర్ ప్లాన్ రోడ్లను వ్యతిరేకిస్తున్నారు కాబట్టి, టిడిపి నేతలు కూడా మద్దతు తెలుపుతున్నామన్నారు. ఇందరు వ్యతిరేకించినా ఏదో స్టార్ హోటల్ జూపార్కు రోడ్డులో త్వరలో నిర్మాణం అవుతుందని వారి సౌకర్యం కోసం ఈ మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మిస్తున్నారని తెలిసింది. అందులోని ఆంతర్యమేంటో వైసిపి నేతలు చెప్పాలన్నారు. తిరుపతిలో అభివృద్ధి మొత్తం ఈ నాలుగేళ్ల వైసిపి పాలనలో జరిగిందని చెబుతుంటే నవ్వేస్తుందన్నారు. అసలు తిరుపతిలో విద్య, వైద్య రంగాలు అభివృద్ధి చేసింది అప్పటి ఎన్టీఆర్, ప్రస్తుత నారా చంద్రబాబు నాయుడి పాలనలోనే అనే విషయం అందరికీ తెలుసన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, ఆరు నెలలు ఆగితే టిడిపి ప్రభుత్వం వస్తుందని, రాగానే ఆ మాస్టర్ ప్లాన్ జీఓను రద్దు చేయించే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో నేతలు ఊకా విజయ్‌కుమార్, ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవకు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వొద్దు

**-సప్తగిరి విశ్రాంతి భవనం బాగుచేయండి -క్యూలైన్‌లలో అత్యవసర గేట్ల వద్ద బయటివారిని పంపుతున్నారు -"డయల్ యువర్ ఇఓ"కు భక్తులు**



తిరుమల, ఆగస్టు 4ప్రభాతవార్తప్రతినిధి: లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు పుణ్యక్షేత్రం తిరుమలలో అందించే సేవలకు (శ్రీవారిసేవ) సేవకులు ఎవరూ కూడా ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, టిటిడి ఉచితంగా అవకాశం కల్పిస్తుందని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మరింత పారదర్శకంగా శ్రీవారి సేవ కేటాయించడం జరుగుతుందన్నారు. ఇది స్వచ్ఛంద సేవ అన్నారు. శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఓ" కార్యక్రమం జరిగింది. పలు ప్రాంతాలనుంచి భక్తులు అడిగిన ప్రశ్నలకు, తెలియజేసిన సూచనలు సలహాలకు టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి సావధానంగా, సానుకూలంగా సమాధానాలిచ్చారు. శ్రీవారిసేవ ఆన్‌లైన్‌లో మాత్రమే కేటాయించడం జరుగు తుందని, ఎవరైనా డబ్బులు తీసుకుని సేవ తీసిస్తామంటే భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. శ్రీవారి సేవ చేస్తున్న మహిళలను అమ్మఅని పిలవాలన్నారు. గూంటూరుకు చెందిన కాశీవిశ్వనాథశర్మ, మోహన్ మాట్లాడుతూ సప్తగిరి విశ్రాంతి భవనంలోని గదులలో పూర్తిగా సదుపాయాలు లేవన్నారు. దీనిపై ఇఓ ధర్మారెడ్డి సమాధానంగా త్వరలోనే టెండర్లు పిలిచి ఆధునీకరించనున్నామన్నారు. విశాఖనుంచి రాము మాట్లాడుతూ తిరుమలలో స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఇఓ స్పందిస్తూ స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్వహణ పరిశుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు. బెంగుళూరుకు చెందిన హరికిరణ్ మాట్లాడుతూ క్యూలైన్లలో అత్యవసర గేట్లనుంచి భద్రత సిబ్బంది బయటి వ్యక్తులను అనుమతిస్తున్నారని, లడ్డూ కౌంటర్ల వద్ద ఇబ్బంది ఉందన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఇఓ ధర్మారెడ్డి తెలిపారు. భక్తులు అద్దె గదులను పొందిన సమయంలో చెల్లిస్తున్న డిపాజిట్ రీఫండ్‌కు సంబంధించి టిటిడి వెబ్‌సైట్‌లో ట్రాకర్‌ను పొందుపరుస్తామని తెలిపారు. తిరుమలకు ఉన్న రెండు ఘాట్‌రోడ్లతో బాటు కాలినడక మార్గాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చేపడుతున్న "శుద్ధతిరుమల, సుందర తిరుమల" కార్యక్రమం ఈనెల 12న టిటిడి విద్యాశాఖ నిర్వహిస్తుందన్నారు. జనవరిలో 2024లో వైకుంఠ ఏకాదశికి డిసెంబర్‌లో శ్రీవాణి, 300రూపాయలు టిక్కెట్లు విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, ఎస్వీబిసి సిఇఓ షణ్ముఖకుమార్, ఐటి జిఎం సందీప్‌రెడ్డి, ఎస్ఇ2 జగదీశ్వరరెడ్డి, పిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఓలు భాస్కర్, రాజేంద్రుడు, శెల్వం, ఆరోగ్యఅధికారి శ్రీదేవి, విజిఓ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం టెండర్లు...
# ప్రైవేటు వ్యక్తులచే పరిశీలనా?

**శ్రీకాళహస్తీశ్వరాలయ ఇంజనీరింగ్ విభాగం పని తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. ఓ వైపు ప్రజల డేటాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటంపై రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ రచ్చ జరుగుతుండగా రాష్ట్రంలోని పది దేవాలయాల్లో ఒకటిగా ముందువరుసలో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివయ్య టెండర్లనే తిరుపతిలోని ఓ ప్రైవేటు వ్యక్తిద్వారా ఒపెన్ చేయించటం చర్చనీయాంశంగా మారింది. ఇంజనీరింగ్ విభాగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారే లేరా? అని చర్చించుకుంటున్నారు. ఇక్కడి టెండర్లను జవాబుదారి తనంతో పర్యవేక్షించే ఉద్యోగిని రాహుకేతుదోష పూజల పర్యవేక్షణ మండపానికి మార్చారు. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది**

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇంజనీరింగ్ విభాగం పని తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారింది. ఈ శాఖలో టెండర్లను పరిశీలించేందుకు పరిజ్ఞానం ఉన్న ఉద్యోగి లేక తిరుపతిలోని ఓ ప్రైవేటు వ్యక్తిని ఆశ్రయిస్తున్నారంటే ఈ ఆలయంలో పారదర్శకత ఎంతో అర్థమౌతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇటీవల టెండర్లు నిర్వహించారు. సింగిల్ టెండర్లు వచ్చిన టెండర్లను రీటెండర్ పిలవాల్సి ఉంది. అయితే కంప్యారిటివ్ స్టేట్‌మెంట్ తయారు చేసే దిక్కులేదు. దాంతో సమస్య ఏర్పడింది. ఇదేమి చోద్యమేమి అని పరిశీలిస్తే ఇక్కడి ఇంజనీరింగ్ విభాగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉద్యోగి లేదని తెలిసింది. గత కొంత కాలంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో టెండర్లకు సంబంధించి తిరుపతిలోని ఓ ప్రైవేటు వ్యక్తి పర్యవేక్షిస్తు న్నట్లు తెలిసింది. ఎంతో సీక్రెట్‌గా పర్యవేక్షించాల్సిన ప్రక్రియను శ్రీకాళహస్తి దేవస్థానం ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు ఓ ప్రైవేటు వ్యక్తిద్వారా జరిపిస్తే పారదర్శకత ఎలా ఉంటుంది. టెండర్ల ప్రక్రియ ఇలా బయటి వ్యక్తులకు ఇవ్వటంలో ఆంతర్యమేమిటో ముక్కంటీశునికే ఎరుక.




**అనుమతితోనే డిఇఇ నిర్ణయం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో టెండర్ల ప్రక్రియను మేకల సుధీర్ అనే ఉద్యోగి పర్యవేక్షించేవాడు. అయితే ఆతనిని రూ.2500 రాహుకేతు పూజా మండపానికి మార్చారు. దాంతో డిఇఇ బయటి వ్యక్తులచే టెండర్లు అప్‌లోడ్ చేసి పర్యవేక్షించేందుకు తిరుపతికి చెందిన ఓ నెట్ సెంటర్ వ్యక్తికి అప్పగించారు. దాంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. మరి డిఇఇ ఎవరి వద్ద అనుమతి తీసుకున్నారో? మరి దేవస్థానం ఉద్యోగులు ఇలా చేయటం ఎంత వరకు సమంజసమన్నది శేష ప్రశ్న.

**పనులు జరగాలి కదా? ఇఇ వివరణ**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో టెండర్ల ప్రక్రియను బయటి వ్యక్తులకు అప్పగించటం గురించి ప్రభాతవార్త ఇఇ నూకా రత్నంను వివరణ కోరగా టెండర్ల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఇక్కడి ఎఇఇలు ఎవ్వరూ సహకరించలేదని, అయితే పనులు జరగాలి కదా? కాబట్టి ఎవరు చూస్తారంటే తిరుపతిలోని ధనపాల్ అనే నెట్ సెంటర్ అతను చూస్తారంటే తాను డిఇఇని పంపినామని వివరించారు. తాను కొత్త కాబట్టి ఇక్కడి పరిస్థితి తెలియదన్నారు.

## ఎర్రచందనం రవాణా చేస్తున్న...
# 10 మంది స్మగ్లర్లు అరెస్టు

**-10 దుంగలు, అంబులెన్సు స్వాధీనం -మరో నలుగురు కోసం గాలింపు**

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 4 ప్రభాతవార్త : ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తున్న 10 మంది స్మగ్లర్లు అరెస్టు చేసి 10 దుంగలు, అంబులెన్సు స్వాధీనం చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి. ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. రోగులకు ఉపయోగించే అంబులెన్సులలో రవాణా చేస్తూ పోలీసులు దృష్టిలో కారం కొట్టే ప్రయత్నం చేశారు. చెక్ పోస్టుల వద్ద అంబులెన్స్ సైరన్ వేసుకుని, లోపల రోగి ఉన్నాడని చెప్పి వేగంగా వెళ్లిపోయి ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడు తుండగా, టాస్క్ పోర్సు పోలీసుల దృష్టికి వచ్చింది. ముందుగా అందిన సమాచారంతో కర్నూలు డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ నుంచి ఆర్ఐ చిరంజీవి టీమ్‌లోని ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం బాలపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారని టాస్క్‌పోర్సు డిఎస్పి మురళీధర్ తెలిపారు. రైల్వే కోడూరు రేంజ్‌లోని బాలపల్లి ఈస్ట్ రేంజి అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి మోటార్ సైకిల్ మీద కనిపించగా, అతను సమాధానం చెప్పకపోవడంతో, అతనిని తీసుకుని ముందుకు వెళ్లినట్టు తెలిపారు. దీంతో వారిని చుట్టు ముట్టే సరికి అక్కడ ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారిని విచారించిన మీదట నెల్లూరు జిల్లా వింజమూరుకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి తమిళనాడుకు చెందిన ఏలగిరి అనే మేస్త్రీ ద్వారా కూలీలను సమకూర్చుకుని బెంగుళూరుకు పంపుతారు. లక్ష్మీనరసయ్య అనే వ్యక్తి అంబులెన్సుకు డ్రైవరరు గాను, ప్రసాద్, మహేష్ అనే వ్యక్తులు రోగులుగా నటిస్తున్న ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈ కేసులో మొత్తం 14మంది ఉండగా 10మందిని అరెస్టు చేశారు. నలుగు కోసం గాలించడానికి ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డితో ప్రత్యేక టీమ్ నియమించారు. ఈ కేసును పోలీసు స్టేషన్‌లో నమోదు చేసి సిఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యాను కలిపి సుమారు రూ. 20 లక్షల వరకు ఉంటుందని డిఎస్పి మురళీధర్ తెలిపారు. ఈ కేసులో కింగ్ పిన్‌ల కోసం గాలిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సిఐ శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌ఓ ప్రేమ పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



కుప్పం పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో శుక్రవారం కుప్పం పట్టణంలో తల్లిపాల వారోత్స వాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పిఇఎస్ మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యత వివరించారు. పుట్టిన పిల్లలకు ముర్రిపాలు అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగం హెచ్ఒడి డా॥ రాజే ంద్రనాయుడు, ప్రొఫెసర్ హరీష్ చంద్ర, కమ్యూనిటీ విభాగం ప్రొఫెసర్ డా॥ అనిల్ రాజ్, డా॥ విఘ్నేష్, లయన్స్ క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, పిజి సెల్వం, సేవ్ ది చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు దేవేంద్రప్ప, మహేష్ , లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కుప్పంరూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వైకాపా తంబిగానిపల్లి ఇన్‌చార్జ్ సిపి మనోహర్, హెచ్ఎం లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో మేరి మిట్టి మేరా దేశ్ నినాదంతో త ంబిగానిపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జీవనశైలిని మెరుగుపరచడంలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు మాధవన్, గంగాధరం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఒబిసి విభాగం అధ్యక్షుడిగా మురుగేష్

శాంతిపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



కాంగ్రెస్ పార్టీ కుప్పం నియోజకవర్గ ఒబిసి విభాగం అధ్యక్షుడిగా శాంతిపురం మండలంకు చెందిన మురుగేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మూలవెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంకు తనవంతు కృషి చేస్తానని మురుగేష్ ఈసందర్భంగా పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైకాపాలో చేరిక

శాంతిపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



మండలంలోని బోయనపల్లి గ్రామంకు చెందిన పలువురు వైకాపా నేతలు కేశవులు, రమేష్‌ల అధ్వర్యంలో ఎమ్మెల్సీ భరత్ సమక్ష ంలో వైకాపా తీర్థ ం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సిఎం జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు చూసి ప్రజలు వైకాపాను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, నేతలు దండపాణి, చక్రపాణిరెడ్డి, ఎవి జయరాం, పెద్దన్న, చెంగప్ప, మురళి, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

## పరువునష్టం కేసులో సుప్రీం తీర్పు 'విద్వేషంపై గెలుపు'

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:

పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీని దోషిగా తేల్చడంపై సుప్రీంకోర్టు స్టే విధిస్తూ తీర్పునివ్వడం 'విద్వేషంపై గెలుపు' అని డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఏజీ పరదేశి అన్నారు. రాహుల్ గాంధీని అణగదొక్కడానికి బిజెపీ ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రం చిత్తూరులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## సాధారణ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారుల నియామకం

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త :

2024లో జరిగే అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను ప్రకటించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారుల వివరాలిలా.. కుప్పంకు ఆర్డీఓ (కుప్పం), పలమనేరుకు ఆర్డీఓ (పలమనేరు), పూతలపట్టు (ఎస్సీ)కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కెఆర్ఆర్‌సి, చిత్తూరు కలెక్టరేట్, చిత్తూరుకు ఆర్ డీ ఓ (చిత్తూరు), జిడి నెల్లూరు (ఎస్‌సి)కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఐఒసిఎల్, చిత్తూరులను నియమించారు. అలాగే నగరికి ఆర్డీఓ (నగరి), సత్యవేడు'(ఎస్సీ) స్పెషల డిప్యూటీ కలెక్టర్, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, తిరుపతి., శ్రీకాళహస్తికి ఆర్డీఓ (శ్రీకాళహస్తి), తిరుపతికి కమీషనర్, మున్సిపల్ కార్పొరేషన్, తిరుపతి., చంద్రగిరికి ఆర్డీఓ (తిరుపతి), పుంగనూరుకు జడ్పీ సిఇఒ చిత్తూరు, మదనపల్లికి ఆర్డీఓ/ సబ్ కలెక్టర్,మదనపల్లి, పీలేరుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఎ), హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 పీలేరు, త ంబళ్లపల్లికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఎ), హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ -1మదనపల్లిలను అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా నియమించారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధిస్తాం!

- తెలుగు యువతచే సైకిల్ యాత్ర శంఖారావం మొదలు
- వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు విస్తృతంగా జనంలోకి
- ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం (రామకుప్పం), ఆగస్టు 4 ప్రభాతవార్త :



వచ్చే ఎన్నికల్లో కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు లక్ష మెజార్టీ సాధిస్తామని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ తెలుగుయువత అధ ్వర్యంలో సైకిల్ యాత్ర శంఖారావంను రామకుప్పంలోని శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 25 రోజుల పాటు తెలుగుయువత అధ్వర్యంలో సైకిల్ యాత్రను నాలుగు మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రామకుప ్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం అర్బన్, రూరల్ మండలాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు హయాంలో కుప్పంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు నేరుగా వివరించడం జరుగుతుం దన్నారు. నాలుగన్నర ఏళ్ల వైకాపా పాలన వైఫల్యాలు సైతం ప్రజల్లో తీసుకెళ్తామన్నారు. అదేవిధంగా మహిళా విభాగంచే సైతం మహాశక్తి పథకం గురించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుప్పంలో అభివృద్ధి ఏం జరగలేదని చెప్పే అధికార పార్టీ నేతలకు తెదేపా పాలనలో వేసిన శిలాఫలకాలే సమాధానం చెబుతాయన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షులు ఆన ందరెడ్డి, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు, నేతలు ఆర్. చంద్రశేఖర్, సత్యేంద్రశేఖర్, త్రిలోక్, ఆంజనేయరెడ్డి, పత్ర నారాయణ,మునస్వామి, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం సంకష్టహర చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం నుండి సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్స వమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాబు, సురేష్, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాథుని సేవలో జడ్పీ ఛైర్మన్

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు టెంపుల్ ఇన్స్ పెక్టర్ బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పంచ లోహ విగ్రహాలు, వెండి కవచాలు విరాళం

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంకు భక్తులు శుక్రవా రం సిద్ధి, బుద్ది సమేత వినాయకస్వామి పంచలోహ ఉత్స వమూర్తులు (చిన్న విగ్రహాలు), ఉత్స వ మూర్తు లకు వెండి కవచాలను విరాళంగా అందజేశారు. బెంగుళూరుకు చెందిన బివి. రతన్‌కుమార్ అనే భక్తుడు సుమారు 1 కిలో 500 గ్రాముల వెండితో 1.50 లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన ఉత్స వమూర్తులు, వాటికి కవచాలను విరాళంగా ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డికి అందజేశారు.టెంపుల్ ఇన్స్ పెక్టర్ సురేష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే పదివేల ఆర్థికసాయం

శాంతిపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త :

మండలంలోని మొరసనపల్లిలో సిద్ధప్ప అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అతని అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్సీ భరత్ పదివేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈనగదును వైకాపా నేతలు జగదీష్, సుబ్రమణ్యం, వరదరాజులు, ఆర్ముగం, మణి, జానకిరాం, బాబు తదితరులు బాధిత కుటుంబానికి అందించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నాయుడుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త:



నాయుడుపేట పట్టణం జైహింద్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం తల్లిపాల వారోత్స వాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ కిట్లు అందజేశారు. జైహింద్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శిరీష మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతమని, బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం హేమ, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, ఎంకెఎస్ సంధ్య, ఆశా వర్కర్ అప్సా నా, అంగన్‌వాడీ హెల్పర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

## మాతమ్మ కొలుపు గోడ పత్రికను ఆవిష్కరణ

బాలాయపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



ఈ నెల 8వ తేది కడగుంట గ్రామంలో జరిగే మాతమ్మ కొలుపు గోడ పత్రికను డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ బొలిగర్ల మస్తాన్ యాదవ్ గోడపత్రికను ఆవిష్కరించారు. గ్రామస్థులందరూ వచ్చి మాతమ్మ కొలుపుకు రావాలని ఆహ్వానించారు. కొలుపు నిర్వహణకు ఆయన కొంత నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు : నేదురుమల్లి

వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త:



సమస్యలు తెలుసుకుని పరిష్కరిం చేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 17వ వార్డు కలివేలమ్మ గుడి తూర్పు వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఇంటి గడప తొక్కి సమస్యలు తెలుసుకోవాలని పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్స న్ నక్క భానుప్రియ, వైస్‌ఛైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సి లర్లు పూజారి లక్ష్మి, ధనియాల రాధా, జానకిరామయ్య, శ్రీనివాసులు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, నాయకులు మురళీకృష్ణ, బ్రహ్మయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త:



రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. పాపమాంబ పురం గ్రామంలో జరుగుతున్న పొలంబడి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విషయాలను వివరిస్తున్నట్లు తెలిపారు. రైతులు పంటల సాగుల్లో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగార్జున సాగర్, ఏవో సుజాత, విస్తరణ అధికారి రామ్మోహన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం

కోట, ఆగస్టు 4 ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంకు డైమండ్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని కోట మండలం ఊనుగుంటపాలెం పిఏసిఎస్‌కు ఉత్తమ పురస్కారం దక్కిన విషయం తెలిసిందే. ఆ మేరకు శుక్రవారం విజయవాడలోని కోఆపరేటివ్ బ్యాంకు కార్యాలయంలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఛైర్మన్ హనుమంతరెడ్డి, సిఇఓ ఆర్.శ్రీనివాసులరెడ్డిలు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గత ఏడాది కూడా జిల్లా స్థాయిలో ఈ సొసైటీ ఉత్తమ పురస్కారం దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా సిఇఓ శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎడబాలెంలో టిడిపి మహాశక్తి

సూళ్లూరుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మండలం ఎడబాలెం, కొమ్మినేనిపల్లి తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఇటీవల మహానాడులో ప్రకటించినమేనిఫె స్టోలో మహాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఒనగూరే ప్రయోజనాల గురించి వివరించారు. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొస్తే మహిళలతో పాటు గ్రామీణ అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, జనార్ధనయ్య, గాడి నారాయణరెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

బాలాయపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త:

గ్రామాల్లో ఉన్న గిరిజనుల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తామని ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని అలలిమిలి ఎస్టీ కాలనీలో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. స్మశానానికి దారి కావాలని కోరారు. ఉపాధి పనులను విరివిగా కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను ఆయన తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్ఐ వీరనారాయణ, స్థానికులు ఉన్నారు.

## సర్పంచ్ చొరవతో ముళ్ల చెట్లు తొలగింపు

ఓజిలి, ఆగస్టు 4 ప్రభాతవార్త :



ఓజిలి మండలం సగుటూరు పంచాయతీ పరిధిలోని ఎస్సీ ల శ్మశాల వాటికకు వెళ్లే రహదారి అంతా ముళ్ల కంప చెట్లతో నిండిపోయి ఉంది. దీనికి స్పందించిన సగుటూరు సర్పంచ్ పంజా వసంతకుమారి జెసిబి ద్వారా ముళ్ల చెట్లన్నీ తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీ వాసులు శ్మశానానికి వెళ్లేందుకు అవస్థలు పడేవారు. ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగి విషసర్పాలకు నిలయంగా ఉండటంతో చెట్లను పూర్తిగా తొలగించారు. దీంతో ఎస్సీ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ వసంతకుమారి మాట్లాడుతూ ఎస్సీ ల శ్మశాన వాటికకు ఎవరైనా చనిపోయినప్పుడు మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో వెంటనే స్పందించి పనులు చేయించామని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం తనవంతు కృషి ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు. చర్యలు చేపట్టిన సర్పంచుకు ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఇఓ

కోట, ఆగస్టు 4 ప్రభాతవార్త :



కోట మండలం చిట్టేడు పంచాయతీ పరిధిలోని మైక్రోటవర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఇఓ మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇటీవల జగనన్న విద్యాసామగ్రి సక్రమంగా పంపిణీ చేశారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

## వెంకటసుబ్బయ్య మృతదేహంతో పోలీస్ స్టేషన్ వద్ద నిరసన

చిల్లకూరు,ఆగస్టు 4, ప్రభాతవార్త

ఈ నెల 3వ తేది నల్లయ్యగారిపాల్యెం గ్రామంలోని అరుంధతి వాడకు చెందిన కొండేటి వెంకటసుబ్బయ్య రొయ్యల చెరువులో ట్రాక్టర్‌తో దుక్కు దున్నేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చెవురు కట్ట ఎక్కుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకట సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిల్లకూరు ఎస్ఐ గోపాల్ గూడూరు ప్రాంతీయ వైద్య శాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో 4వ తేది శుక్రవారం పోస్టుమార్టం అనంతరం వెంకట సుబ్బయ్య మృతదేహాన్ని చిల్లకూరు పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకెళ్ళి ఆర్థిక సహాయం అందించాలని బంధువులతోకలిసి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసారు. అనంతరం ఎస్ఐ గోపాల్ ఇరువురిని పిలిపించి 3 లక్షల రూపాయిలు ఆర్థిక సహాయం వెంకట సుబ్బయ్య కుటుంబానికి అందించడం జరిగింది. దీంతో నిరసన విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారు

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్

చిల్లకూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త

రాష్ట్రంలో పేద ప్రజలందరికి అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం చిల్లకూరులో కోటి 50 లక్షల రూపాయిలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా తిరుపతి జిల్లా డిఎంఅండ్‌హెచ్ఎం శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి విద్యా, వైద్యం కోసం వేల కోట్ల రూపాయిలు ఖర్చు పెడుతున్నారని, వెల్నెస్ సెంటర్, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం అధునాతనమైన పరికరాలతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో కనీసం 14 మందిని వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడడం జరుగుతుందన్నారు. పేద ప్రజల కోసం ఉచితంగా 300 రకాల సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స విషయంలో ఎక్కడా అవాంతర సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో దాతల సహాయంతో మొక్కలు నాటడంతో పాటు ఆర్ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ ఓడూరు యమునమ్మ, గూడూరు మండల కన్వీనర్ గుమ్మడి శ్రీనివాసులు, పిఏసిఎస్ ఛైర్మన్ రాజనేని పిచ్చయ్య నాయుడు, వైస్ ఏఎంసి ఛైర్మన్ పుట్ట గోవర్ధన్, జడ్పిటిసి మణ్యం శీనయ్య, వైఎస్ ఎంపిపి పోలిబోయిన చెంగయ్య, డాక్టర్లు బావనారాయణ, పాల్ జేమ్సెన్, ఎంపిడిఓ నిర్మల దేవి, ఈఓఆర్డి దాసరి రాజమాణిక్యం, నాయకులు కోడూరు మీరారెడ్డి, సునీల్ రెడ్డి, సతీష్ రెడ్డి, విఆర్ఓ రమణయ్య,వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాల్లో ఇస్లాం మతంపై పెరుగుతున్న ఆదరణ



**శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త :** ప్రపంచ దేశాల్లో ఇస్లాం మతంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది. 2019 లెక్కల ప్రకారం ప్రపంచంలో 18శాతం మంది ఇస్లాం మతాన్ని కొత్తగా స్వీకరించారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ వివరించారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన ఆలోచనాత్మక ప్రసంగాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యఖుర్‌ఆన్‌లో స్పష్టంగా 'కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని' స్పష్టం చేసారన్నారు. ప్రపంచ దేశాల్లో ప్రజలు ఇస్లాం మతం వైపు మొగ్గు చూపుతుంటే భారత దేశంలో ముస్లింలు ఏం చేస్తున్నామని ప్రశ్నించారు. మనం ఇతర మతాలవైపు దృష్టి సారించి మన సంప్రదాయాలు, ఆచారాలు తుంగలో తొక్కి పరమత సంప్రదాయాలను ఆచరిస్తూ అల్లాహ్‌కు దూరమౌతున్నామన్నారు. ఈ దుస్థితిని విడనాడాలని ఆయన పిలుపు నిచ్చారు. ఇస్లాం మతం కోసంప్రాణాలనుసైతం లెక్క చేయకుండా మన ప్రవక్తలు స్వర్గస్థులయ్యారన్నారు. ఈ సందర్భంగా నమాజులు ఆచరించాల్సిన కొన్ని ప్రాథమిక సూత్రాలను వివరించారు.

## బదిలీ ఉపాధ్యాయులకు ఘనసత్కారం

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :



ఊరందూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్ళిన ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వసుంధర, భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు మంజులాదేవి, తెలుగు ఉపాధ్యాయురాలు దోర్నజలలను పాఠశాలలోని ఉన్న పాఠశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, శాంతి, బిందు, సుమతి, రజియా, మల్లికార్జున, మునీంద్రబాబు మరియు ఊరందూరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :



భారతీయజనతాపార్టీ తిరుపతి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కోర్ కమిటీ, అసెంబ్లీ కన్వీనర్ మరియు పదాధికారులు మండల అధ్యక్షులు సమావేశంలో పట్టణ బిజెపి సమన్వయకర్త, రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా. ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాలతో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 10వతేదీన 5వేల మందికిపైగా మహాధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నెల్లూరు జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ బహిరంగసభను జయప్రదం చేయండి

తొట్టంబేడు, ఆగస్టు 4 ప్రభాతవార్త :




తిరుపతిలో జరిగే సిపిఐ పార్టీ బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతు శుక్రవారం సిపిఐ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిధిగా రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు హరనాథరెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి..దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు జరిగే బస్సు జాతను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 8న తిరుపతిలో జరిగే సిపిఐ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి జనమాలగురవయ్య, మండల కార్యదర్శులు శివకుమార్, గోపి, మోహనరెడ్డి, శ్రీనివాస్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజన్, ఏఐటియుసి నియోజకర్గ కార్యదర్శి వైఎస్‌మణి, ప్రజా సంఘాల నాయకులు సురేష్, ధన, సురేష్, మల్లి, మురళీ, కార్తీక్, రమేష్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల నిరసన

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :



మణిపూర్ అల్లర్లపై శ్రీకాళహస్తి పట్టణంలో ముస్లిం మరియు క్రైస్తవ సోదరులు మణిపూర్‌లో అల్లర్లు పూర్తిగా మారాలని ప్రార్థనలు చేపట్టి, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మణిపూర్‌లో అల్లర్లు సత్వరం రూపుమాపాలని కోరుతూ అందరు మైనార్టీలు, ఫాస్టర్లు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఫాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనులపై దాడులు చేస్తున్నారని ఇది బిజెపి ప్రభుత్వం మతతత్వ అల్లర్లు ప్రేరేపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు ఫాస్టర్ సైమన్, ఆనందబాబు, బాలస్వామి, ఇమ్మాయిల్, ఇస్మాయిల్, కరీముల్లా తదితరులుతో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి : ఎస్‌సివి



**శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శనివారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయ వంతం చేయటానికి ప్రతి కార్యకర్త జవాబుదారి తనంతో పని చేయాలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన రేణిగుంట మండలంలోని వై కన్వెన్షన్ హాల్‌ను అలాగే బాలాజి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ నేడు రాష్ట్రం క్లిష్ట పరిస్థితిలో ఉందని కాబట్టి తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా పని చేస్తుందని సమర్థుడైన నాయకుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పరిసరాల్లో ఉన్న పెళ్ళకూరు, బుచ్చినాయుడుకండ్రిగ, కెవిబిపురం మండలాల్లోని ద్వితీయ శ్రేణి నాయకులతో ఎస్‌సివి నాయుడు చర్చించారు. ఆయనతో పాటు మాజీ శాసనసభ్యుడు సత్రవాడ మునిరామయ్య, సత్రవాడ ప్రవీణ్, భాస్కర్‌నాయుడు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు:



**ఏర్పేడు(శ్రీకాళహస్తి రూరల్),ఆగస్టు 4 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి తిరుపతి రహదారిలోని మేర్లపాక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగురుమహిళలు గాయపడినట్లు సమాచారం. శుక్రవారం చిత్తూరుజిల్లా కల్లూరుకు చెందిన ఐదుగురు మహిళలు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి ఆటోలో బయలు దేరారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిరుగుపయనమయ్యారు. ఆటోలో పెద్దలు పిల్లలు మొత్తం పదిమంది ఆటోలో పయనిస్తున్నారు. ఆటో మేర్లపాక సమీపంలోని ఓ ప్రైవేటు భారీ పరిశ్రమ వద్ద ఆటోలో డ్రైవర్ పక్కన ఓ మహిళ కూర్చొని ఉండగా బహుశా ఆమె చేయితగిలిందో ఏమో కాని ఆటో అదుపు తప్పి బోల్లాపడింది. వెనకనే ఓ మినిలారీ వస్తుండగా ప్రమాదంం గమనించి డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న లోకేష్(21) కరిష్మా(24), యమునా(33), సల్మా (22)లు గాయపడ్డారు. వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేణిగుంటలో నూరాని మత్తబ్ ప్రారంభం

**రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త:** రేణిగుంట పట్టణంలో వైసీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్



అహ్మద్ సొంత నిధులతో ముస్లిం మైనారిటీ పిల్లలకు యువకులకు ఉర్దూ అరబ్బీ బోధించడానికి నూరాని మత్తబ్ బోధనాశాలను ప్రారంభించారు. ఆసక్తి ఉన్న ముస్లిం మైనారిటీలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 వరకు బోధనశాలకు వచ్చి ఉర్దూ అరబ్బీ నేర్చుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు రసూల్ అహ్మద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డి సూచనల మేరకు బోధనాశాలను ముస్లిం మైనారిటీ పెద్దల ఆశీస్సులతో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట వైసీపీ మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, అధ్యక్షుడు రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నాగేషం, రేణిగుంట పట్టణ వైసీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, మైనారిటీ నేతలు షబ్బీర్, ఇరానీ ఖాదిర్, అడ్వకేట్ జాకీర్ హుస్సేన్, మాబా, వార్డు మెంబరు జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో చంద్రబాబు బస



**రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాపర్యటనకు వస్తున్న ప్రతిపక్ష నాయకుడు, జాతీయ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రేణిగుంట పట్టణం పాత చెక్‌పోస్టు సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్లో శుక్రవారం రాత్రి బస చేశారు. ఆయనకు శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి, ఇజల్లా నాయకులు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్.వి. నాయుడు, రేణిగుంట మండల పట్టణ టీడీపీ నాయకులు మునిచంద్రారెడ్డి, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, చిన్నారెడ్డి, మహబూబ్‌బాషా, నెల్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. అంతకు ముందు సుధీర్‌రెడ్డి పుంగనూరులో చంద్రబాబు నాయుడుపై జరిగిన దాడిని విలేకరుల సమక్షంలో ఖండించారు.

## మహాశక్తితో భవిష్యత్తు గ్యారంటీ

పుత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గ్యారంటీ పథకాల ప్రచారంలో భాగంగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ సూచనలతో మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్ ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో గోపాలకృష్ణాపురం పంచాయతీ ఎస్టీ కాలనీ, సిరుగురాజుపాళెం పంచాయతీ దిగువగూళూరులో మారియమ్మ గుడిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మిప్రసన్న, నగరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నాగరత్న, విజయపురం మండల అధ్యక్షురాలు గుణ భూషణమ్మ, తదితరులు మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బెస్త వీధిలోవెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న సూర్య భగవానుడి సుబ్రహ్మణ్యస్వామికి కూడా అభిషేకాలు చేశారు. సాయంత్రం గణపతి హోమం నవగ్రహ హోమం, ప్రత్యేక హోమాలు చేశారు. అలాగే శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మండల పరిధిలోని తొరూరు గ్రామంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్థి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## గంగజాతరను పవిత్రంగా జరుపుకోవాలి

పుత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:

ప్రతి సంవత్సరం ఆనవాయితీగా శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అనంతరం, వినాయకచవితికి ముందుగా వెలసి ఉన్న శ్రీ పిడికిలి గంగమ్మతల్లికి గంగజాతర జరుగుతుందని కమిటీసభ్యులు తెలిపారు. ఈ గంగజాతరను నిర్విఘ్నంగా, పవిత్రంగా జరుపుకోవాలని సభ్యులు, సలహాలు, వారి వారి సూచనలు ఇవ్వాలని కోరారు.

## ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య!

తిరుపతి క్రైం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



ఉరివేసుకుని విద్యార్థి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ కళాశాలలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్ఐ ఎం.పి నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా, బైరెడ్డిపల్లి మండలం, కడతట్లపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి కూతరు గీతాంజలి ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతూ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థి గురువారం సాయంత్రం ఉరివేసుకోవడంతో గమనించిన కళాశాల సిబ్బంది రూయ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్ఐ ఎంపి నాయక్ తెలిపారు.

## పార్సెల్ వస్తువులు బహిరంగ వేలం

-ఆర్టీసీ కమర్షియల్ ఏటిఎం సురేంద్రబాబు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 4 ప్రభాతవార్త:

ఈనెల 17 మరియు 18 తేదీలలో రెండు రోజుల పాటు ఉదయం 10-30 గంటలకు ఆర్టీసీ కార్గో పాయింట్ నందు కస్టమర్లు డెలివరీ తీసుకోని పార్సెల్ వస్తువులకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఏపిఎస్‌ఆర్టీసీ కమర్షియల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఆర్.సురేంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## 12న సుందరతిరుమల విజయవంతం చేద్దాం : జెఇఓ

తిరుమల,ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:



పుణ్యక్షేత్రం తిరుమల ఘాట్‌రోడ్లు, కాలినడక మార్గాలను సుందరతిరుమల శుద్ధతిరుమలగా నిర్వహించే కార్యక్రమం విజయవంతం చేద్దామని టిటిడి జెఇఓ సదాభార్గవి పిలుపునిచ్చారు. ఈనెల 12వతేదీ రెండవ శనివారం జరగనున్న ఈ పవిత్రత, పర్యావరణ పరిరక్షణకు టిటిడి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొంటున్నారన్నారు. టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి పిలుపుమేరకు నిర్వహించే సెక్టార్‌వారీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిఇఓ భాస్కర్‌రెడ్డి, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, విజిఓ మనోహర్, కళాశాలల ప్రిన్సిపాళ్ళు, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార వేదిక సర్వసభ్య సమావేశం

సత్యవేడు, ఆగస్టు 4 ప్రభాతవార్త:




ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధుల ద్వారా తెసుకుని పరిష్కరమార్గాలను చూపే వేదిక, సర్వసభ్య సమావేశం అని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో యంపిపి ప్రతిమ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేమాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు త ెలుపుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన భాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలకు పౌర సేవలను సులభతరం చేస్తూ సమస్యలను పరిష్కరించే దిశగా జగన్న సురక్ష కార్యక్రమాలన్ని అమలుచేసి విషయాన్ని గుర్తుచేశారు. మండలంలోని సమస్యలను పలువురు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసి విజయలక్ష్మి, మండల అధికారులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి హైదరాబాదు గండిపేటకు చెందిన భక్తులు విరాళం అందించారు. ఈ పథకానికి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవతో భూరి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో గండిపేటకు చెందిన ప్రేమ్‌చంద్ వారి కుటుంబసభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారు నిత్యాన్నదాన పథకానికి ఆకర్షితులై రూ.లక్షా ఐదువేలు విరాళంగా అందించారు. వారితో పాటు మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు అత్తింజేరి బాలాజి కూడా ఉన్నారు.

## దేశంలోకి బొల్లినేని!

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 4 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు తెలుగుదేశం పార్టీలో చేరాలని శ్రీకాళహస్తి తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, బొజ్జల బృందమ్మలు ఆయన నివాసానికి వెళ్ళి అభ్యర్థించారు. మర్యాద పూర్వకంగా కలసి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేర్పించటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈకార్యక్రమాల్లో వారితో పాటు మలిశెట్టి వెంకటేశ్వర్లు, చెంచయ్యానాయుడు, మునిరాజనాయుడు, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్లగంగమ్మ ఆలయంలో పవిత్రమ్మ పూజలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త :



పట్టణంలోని బహాదూరుపేటలో వెలసిన నల్లగంగమ్మ ఆలయం వద్ద శుక్రవారం వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రమ్మ పూజలు జరుపుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ శ్యాం, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, జిల్లా మానిటరింగ్ సభ్యులు పసల సురేష్, మడగల సాయి, సిఆర్డి ప్రసాద్, పత్తిమణి, పూల కృష్ణమూర్తి, కొట్టేశ రవణ, ఉమాదేవి, దీపిక, జయశ్రీ, అమ్ములు, రాజేష్, సురేష్, కుమార్, బలరాం, హైమావతి, మల్లికలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : హర్షిత్ రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తూ వుందని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం కెకెవి పురం, కమ్మపల్లి, లింగమ నాయుడు కండ్రిగ గ్రామాలలో గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను గడపగడపకు అందజేశారు. గ్రామాలలో మహిళల మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, నాయకులు గణపతి నాయడు, సిద్దముని రెడ్డి, బీకిరెడ్డి, మహేందర్ రెడ్డి, జ్యోతి, రాజేష్, చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్ రాయల్, మునీంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

నారాయణవనం, ఆగస్టు 4 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి శుక్రవారం సాయంత్రం 6గంటలకు శాస్త్రోతకంగా ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 14వ తేది వరకు మహాభారతం చెప్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద ఆర్‌డి ఏకాంబరం, ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, మాజీ ధర్మకర్త దేశప్పరెడ్డి, చొప్పా.మునిరాఘవులుశెట్టి, వి.ఆంజనేయులుశెట్టి అండ్ సన్స్, బి.చెంచయ్యశెట్టి అండ్ గుప్తా, వర్తక, వాణిజ్యసంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలి అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## పురిటి బిడ్డలకు ముర్రుపాలే ఆరోగ్య సంజీవిని

రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త:



పురిటి బిడ్డలకు తల్లి నుంచి సంక్రమించే ముర్రుపాలే జీవితాంతం రోగాల నుంచి కాపాడే ఆరోగ్య సంజీవిని అని రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేషం అన్నారు. తల్లి పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రేణిగుంట సర్పంచ్ నాగేషం వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బాలింతలకు, గర్భినీలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు సహకారంతో పౌష్టికాహార కిట్లను టేక్ హోం ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల కోసం జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

## పుట్టిన ఊరు రుణం తీర్చుకోవాలి ఆర్చి నిర్మాణం

వడమాలపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త:



పుట్టిన ఊరు కన్నతల్లితో సమానమని భావించి గ్రామానికి పది లక్షల రూపాయలతో ముఖ ద్వారంను నిర్మించి తన విశాల హృదయాన్ని చాటుకున్నారు. ముద్దులూరు రామచంద్రరాజు, వడమాలపేట మండలం తిరుమణ్యం పంచాయతీ రాజులకండ్రిగ గ్రామంలో జన్మించిన ముద్దులూరు రామచంద్రరాజు ఇక్కడే చదువుకుని ఎదిగారు. వ్యాపార నిమిత్తం ముంబైకి వెళ్లి స్థిరపడ్డారు. ఆర్థికంగా బాగా సంపాదించిన రామచంద్రరాజు తన పుట్టిన ఊరిని ఎన్నడూ రమచిపోలేదు. గ్రామానికి ఏదో చేయాలనే తపనతో గ్రామస్థులతో చర్చించారు. రాజులకండ్రిగ ప్రధాన రహదారికి కొంత లోపాలుగా ఉండడంతో ప్రధాన రహదారి ముందు ముఖ ద్వారం నిర్మించాలని గ్రామస్థులు కోరారు. దీంతో సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో తమ తల్లిదండ్రులు సాలమ్మ, చెంగల్రాజు జ్ఞాపకార్థం ముఖ ధారంను రామచంద్రరాజు సుందరంగా నిర్మించారు. దానిని గ్రామస్థులతో కలసి శుక్రవారం శాస్త్రోక్తంగా అగ్నిహోమం నిర్వహించి వేదమంత్రాలతో ఘనంగా ప్రారంభోత్సవం చేశారు.

## నగరి ఓంశక్తి ఆలయంలో ఆడి శుక్రవారం


నగరి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



నగరి మున్సిపాలిటీ నగరి పట్టణంలో వెలసి ఉన్న మేల్‌మరువత్తూర్ ఆది పరాశక్తి ఆలయంలో గంజి, అంబలి, పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. పవిత్ర మాసమైన ఆడి మాసం ఆడి శుక్రవారం పర్వదినాన 450 మంది ఓం శక్తి భక్తులు ఎర్రటి దుస్తులతో గంజి పాత్రల కలశములను తలపై ఉంచుకుని ఓం శక్తి పరాశక్తి అని శరణు ఘోషతో నగరి ఈశ్వరాలయం నుంచి బయలుదేరిన ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా పోస్టల్ డిపార్ట్‌మెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్, కుటుంబ సమేతంగా, స్థానిక ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సిబ్బంది, నగరి పోస్టల్ సబ్ పోస్టుమాస్టర్ గీతాలు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లోని ఓం శక్తి మహిళా భక్తులు, ఎరుపు దుస్తులతో ఊరేగింపులో పాల్గొనడం విశేషంగా భక్తులకు ఆకర్షించాయి. స్థానిక భక్తులు అమ్మవారి సేవకులు ఆది పరాశక్తి అమ్మవారికి గంజి అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అమ్మవారి ప్రసాదాలతో పాటు కుంకుమ, పసుపు, స్వీట్లు పంపిణీ చేశారు.

## పాఠశాలల వంట కార్మికులకు జీతాలు పెంచాలి

నగరి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



జగనన్న గోరు ముద్ద మెనూ ప్రకారం పెట్టాలంటే మెస్ చార్జీలు పెంపుకై ప్రత్యక్ష పోరాటానికి మహిళా కార్మికులకు సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. నగరి మండల పరిధిలోని మధ్యాహ్న భోజనం వర్కర్స్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ నగరి ఎంఈవోకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం మిడే డే మీల్స్ మడలనాయకులు కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మంది పని చేసే జగనన్న గోరుముద్ద పథకం కార్మికులకు ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాల వల్ల మెస్ చార్జీలు పెంచకుండా పెరిగిన నిత్యావసర ధరలను పరిగణలోకి తీసుకోకుండా జగనన్న గోరు ముద్ద పథకం అమలు చేయాలని ఒత్తిడి చేస్తూ వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ మధ్యాహ్న భోజనం పథకం ఏఐటీయూసీ అనుబంధ సంఘం మండల కార్యదర్శి జమున, అధ్యక్షులు కృష్ణవేణి, మహాలక్ష్మి, వేణి, కుప్పమ్మ, మల్లీశ్వరి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## నడకదారిలో షాపులో దాడి

తిరుమల,ఆగస్టు 4ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమల నడకదారిలో ఆవులోళ్ళ షాపులో కొందరు డ్రైవర్లు దుకాణం సిబ్బందిపై దాడి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భక్తులకు దుకాణంలో వస్తువులు సకాలంలో ఇవ్వలేదనే నెపంతో ఈ దాడి జరిగినట్లు పోలీసులు సమాచారం. తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డిని కలసిన గాలి



నగరి, ఆగస్టు 4 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన సందర్భంగా మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ ప్రెసిడెంట్ పులివర్తి నానితో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఆయనతో పాటు నగరి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు

**- రాజకీయ లబ్ది కోసమే ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారు**
**- మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**

వెంకటగిరి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



సీఎం జగన్మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కురుగొండ్ల రామకృష్ణ మండిపడ్డారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామం వద్ద ఆగి ఉన్న రిజర్వాయర్ పనులను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల జిమ్మిక్కుల కోసం తన సొంత నాయకుల ప్రయోజనాల కోసం, కాంట్రాక్టర్ల కోసం పని చేస్తున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవడంలేదన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి సవాలు విసిరారు. సైకో సీఎం పాలనలో 850 కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. 1450 ఎకరాలు బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం నేతన్న నేస్తం సభకు వెంకటగిరికి వచ్చి రిజర్వాయర్ కోసం రూ.553 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎన్నికల లబ్ది కోసమే ప్రకటించినట్లు విమర్శించారు. టీడీపీ అందికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల లోగా ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, ఒక్క ప్రాజెక్టు అయినా పూర్తి చేసి ఉంటే వైసీపీ నాయకులు అయినా చూపాలని తెలిపారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు నిధులు ఇవ్వాలని సీఎంను ఎమ్మెల్యే ఆనం కోరాడని నిధులు ఆగినందు వలన ఆయనను పక్కన పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, సీసీ నాయుడు, మాజీ జెడ్పీటీసీ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయండి

**-షెడ్యూలు విడుదల -పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్**



శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి పట్టణంలో నేడు జరిగే తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ కోరారు. నేడు ఉదయం 10గంటలకు తిరుపతిలోని వై కన్వెన్షన్ హాలు నుంచి బయలుదేరిన ఆయన రేణిగుంట మండలంలోని బాలాజీ రిజర్వాయర్‌ను పరిశీలించనున్నారు. అనంతరం కరకంబాడి రోడ్డు నుంచి రేణిగుంట మీదుగా బయలుదేరిన ఆయనకు మిట్టకండ్రిగ వద్ద నుంచి ఘనస్వాగతం పలికి శ్రీకాళహస్తి ఏపిసీడ్స్ కూడలి వద్దకు చేరుకుంటారన్నారు. గత నాలుగేళ్ళలో వైఎస్ఆర్‌సిపి పార్టీ తాగునీరు, సాగునీరు ఇవ్వడంలో పూర్తిగా విఫలం అయ్యిందని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేయడానికి తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. మద్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు స్థానిక బేరివారి మండపం వద్ద సుమారు 30వేలమందికి పైగా బహిరంగసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు మలిశెట్టివెంకటేశ్వర్లు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, తిరుపతి పార్లమెంటు రైతు నాయకుడు ప్రకాష్‌నాయుడు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, మాజీ కౌన్సిలర్ శెంజిగరంసుప్రజ, శెంజిగరంవేలు, బిసి నాయకులు పోలూరుశ్రీనివాసులురెడ్డి, మైనార్టీ నాయకుడు షాకిరాలీ, అస్మత్, జిలానీ, ఉమేష్‌రావు, బుజ్జి, మునిరాజయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ద స్కూల్‌లో రెడ్ కలర్‌డే

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త



విద్యార్థి దశలో పిల్లలు మొదటిగా గుర్తించే రంగు ఎరుపు రంగు అని, అలాంటి ఎరుపు రంగు ప్రాధాన్యత విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాఠశాల కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ అన్నారు. శుక్రవారం ద స్కూల్‌లో కిండర్ గార్డెన్ విద్యార్థులకు రెడ్ కలర్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుపు రంగులో ఉండే ఆహార పదార్థాలు తినడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం విశాల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాజీ ఉపరాష్ట్రపతికి శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త
మాజీ ఉపరాష్ట్రపతి, బిజెపి సీనియర్ నాయకులు వెంకయ్యనాయుడును శ్రీకాళహస్తి బిజెపి మీడియా రాష్ట్ర ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా.ఆనంద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలసి శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించి శేషవస్త్రంతో సత్కరించారు.

## దళిత రిజర్వేషన్లను కాలరాస్తున్నారు : పులిశ్రీకాంత్

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :



పేదల సొమ్మును కాజేసేందుకు కొందరు అగ్ర కులస్తులు దొడ్డిదారిలో దళితులుగా చలామణి అవుతూ ఎస్సీ రిజర్వేషన్లను కాలరాస్తున్నారని జైభీం ఆర్మీ వ్యవస్థాపకుడు పులిశ్రీకాంత్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు అగ్రకులస్తులు దొడ్డిదారిలో దళితులుగా చలామణి అవుతూ ఎస్సీ రిజర్వేషన్లను కాలరాస్తు న్నారని అలాంటి వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. గుంటకిందపల్లి భూవివాదంలో అగ్ర కులస్తులను ఎస్సీలుగా చేర్చి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చేపల చెరువుపై రాజకీయం వద్దు

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త :



తొండమనాడు చేపల చెరువుపై రాజకీయం చేయడం మానుకోవాలని కోదండరామాపురం సర్పంచ్ కె.రామిరెడ్డి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డికి హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా తొండమనాడు చేపల చెరువు నుంచి స్థానిక ఎంఎల్‌ఏ మధుసూధన్‌రెడ్డికి, వైసిపి నేతలకు వాటాలు అందుతున్నాయని ఆరోపించడం సరికాదన్నారు. కోదండరామాపురం, కలుజుమిట్ట గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. సర్పంచ్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ తరతరాలుగా తమ తాతల తరం నుంచి తొండమనాడు చెరువులో చేపలు పట్టి జీవిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తంగవేలు, మురళీ, నాగరాజు, మధు, రంగారెడ్డి, మునిరాముడు, చెంగల్రయరెడ్డి, సుబ్రమణ్యం, జి.వెంకటరెడ్డి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడుకు గజమాలతో ఘన స్వాగతం

గంగవరం, ఆగస్టు 4 ప్రభాతవార్త :
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ఉన్నా రాత్రి 8 గంటల వరకు ఆలస్యమైనా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. క్రెన్ సహాయంతో తమ అభిమాన నాయకుడు చంద్రబాబుకు గజమాలతో సత్కరించారు.

## కేంద్ర జౌళిశాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఎంపి భేటి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 4 ప్రభాతవార్త :



తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి నేడు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో మంత్రిత్వ కార్యాలయంలో భేటి అయ్యారు. ఈ భేటీలో తిరుపతి కాటన్ మిల్లుతో పాటుగా హస్తకళల సేవా కేంద్రం ఏర్పాటు గురించి చర్చించారు. గతంలో జౌళి మంత్రిత్వ శాఖ కాటన్ మిల్లు పునరుద్ధరణ గురించి సమాధానం ఇస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖకి సంబంధించిన నీతి ఆయోగ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ విభాగంతో సంప్రదించి పునరుద్ధరణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలియజేసారని అందుకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయనకి చూపిస్తూ దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న సుమారు 1000 కుటుంబాలకు ఈ మిల్లు జీవనోపాధికి కల్పిస్తున్నదని దయచేసి మిల్లు పునరుద్ధరణకు సహకరించాలని కోరగా అనంతరం నీతీ ఆయోగ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ నుండి సమాధానం వచ్చిన పిదప దేశంలోని మొత్తం 23 కాటన్ మిల్లుల గురించి నిర్ణయం తీసుకొంటామని ఉద్యోగులకి పెండింగ్‌లో ఉన్న జీతాలని కూడా ఇస్తామని చెప్పారని ఎంపి తెలియజేసారు. అలాగే తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో కలంకారి వంటి పురాతన ప్రసిద్ధ హస్తకళలు మార్కెట్ చేసేందుకు తిరుపతిలో మంచి అవకాశం ఉన్నందున ప్రాధాన్యత ప్రాతిపదికన తమ ప్రతిపాధనలను పరిశీలించవల్సిందిగా ఆయనను కోరగా సానుకూలంగా స్పందించారని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలియజేసారు.

## ఏపీ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

**వైఎస్ఆర్‌సిపి ఐటి వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడి శ్రీనివాసులు రెడ్డి**

ఓజిలి, ఆగస్టు 4 ప్రభాతవార్త :
ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచానికి, దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని వైసిపి యువ నాయకులు వైఎస్ఆర్‌సిపి ఐటివింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలన్ని ఏకమైన ప్రజల ఆశీస్సులు ఉన్న ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వాన్ని ఓడించలేరని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతున్న విషయాన్ని సాక్షాత్తు ప్రపంచ దేశాలు, ఇతర రాష్ట్రాలు సిఎం జగన్ మోహన్ రెడ్డి పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం పనితీరును ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ప్రశంసించడం మీకు గుర్తు లేదా అని ప్రతిఫక్షాలను ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వం పై బురద చల్లడం తగదని ఆయన అన్నారు. సంక్షేమ పథకాల అమలులో, జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ భారతదేశం మొత్తం మీద మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునే నూతన ఒరవడికి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను ఎలా కత్తిరించాలా అనే ఆలోచనతో పరిపాలన చేయగా నేడు మన జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూర్చుతోందన్నారు. పారదర్శక పాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి విజయం సాధిస్తారని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆయన తెలిపారు.

## పుంగనూరులో చంద్రబాబుపై దాడి...ఖండించిన పార్టీశ్రేణులు

తిరుపతి,ఆగస్టు 4ప్రభాతవార్త:



ప్రాజెక్టుల పరిశీలన పర్యటనకు చిత్తూరుజిల్లాకు విచ్చేసిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పుంగనూరులో అధికార పార్టీ నేతలు రాళ్ళదాడి చేయడం దారుణమని తిరుపతిలో టిడిపి నేతలు ఖండించారు. చంద్రబాబుకు పూర్తి భద్రత ఉందని, నిజంగా వైసిపి ప్రభుత్వం ప్రజలకు మంచి పనులు చేసి ఉంటే,రైతాంగానికి ప్రాజెక్టులు తీసుకువచ్చి సాగు,తాగునీరు అందించి ఉంటే వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు భయంతో పర్యటన అడ్డుకోవడం, దాడికి దిగడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు.శుక్రవారం పుంగనూరు పర్యటనకు వచ్చిన చంద్రబాబును వైసిపి నేతలు, పోలీసుల అండతో అడ్డుకోవడం విచిత్రంగా ఉందన్నారు. దీన్ని నిరసిస్తూ తిరుపతిలో టిడిపి నేతలు ఆర్‌సి మునికృష్ణ, ఊట్లసురేంద్రనాయుడు, ఆర్‌పి శ్రీనివాసులు, ఆనంద్‌గౌడ్, జ్ఞానశేఖర్, సందీప్, కరాటే చంద్ర తదితరులు నల్లరిబ్బన్లు తలకు కట్టుకుని ఎన్టీఆర్ కూడలిలో నిరసన తెలిపారు.

## జగనన్న సంక్షేమ పథకాలకు విశేష స్పందన


**-ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూదనరెడ్డి**



ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), ఆగస్టు 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జగనన్న సంక్షేమ పథకాలకు జనం నుంచి విశేష స్పందన వస్తుందని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏర్పేడు మండలం నచ్చనేరి,దుర్గిపేరి సచివాలయ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఇంకేం కోరుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అర్హత ఉండి ఏ ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందలేదంటే అధికారులను ఇంటికి పంపు తామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. రాష్ట్రంలో జగనన్న రాజ్యంతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందని శాసనసభ్యుడు అన్నారు. ఆయన గత మూడు రోజులుగా ఏర్పేడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ప్రకటించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యక్రమాలను వైకాపా మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి సారథ్యంలో ఇతర వైకాపా నాయకులు, మండల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో నచ్చనేరి సర్పంచ్ మునిరామిరెడ్డి, ఉప సర్పంచ్ మల్లేశ్వరి, వైస్ ఎంపిపి జమ్మల శ్రీనివాసఉులు,సర్పంచ్‌ల సంఘాధ్యక్షుడు శివయ్య, సర్పంచులుగాదే రాజేశ్వరి, గోవిందరెడ్డి, పెంచలయ్య, పి.సిద్దయ్య, సి.నారాయణ, రామచంద్రారెడ్డి, ధనంజయరెడ్డి, భాస్కర్‌రెడ్డి,మునిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించండి: కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 4 ప్రభాతవార్త :



ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగనన్నకు చెబుదాం, స్పందన, తదితర కార్యక్రమాల్లో ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారంపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం వచ్చిన ఫిర్యాదులు వాటిలో ఎన్ని పరిష్కారం అయ్యారు. పరిష్కారం కానివి ఎందుకు కాలేదని ఆయా విభాగాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న జగనన్నకు చెబుదాం, స్పందన, తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ ఫిర్యాదు మీకు అందిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులు నేరుగా పిర్యాదు చేయబడిన వ్యక్తి వద్ద ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. వీలైనంత వరకు అన్ని సమస్యలు వెంటనే పరిష్కారం అయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, కెఎల్ వర్మ, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరికృష్ణ, ఫైర్ శ్రీనివాసరావు, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రవీంద్రా రెడ్డి దేవిక, గోమతి, డిసిపీ శ్రీనివాసులు, ఏసిపి బాలసుబ్రమణ్యం, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కరుగుతున్న కాలం.. కరుణించని మేఘం

**- ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న వరుణుడు**

కోట, ఆగస్టు 4 ప్రభాతవార్త :



ఆకాశంలో మబ్బులు తప్ప నేల మీద తేమ జాడ ఉండటం లేదు. మబ్బులు పట్టి ఊరిన వరుణుడు ఆపై తేలిపోయి ఉసూరుమనిపిస్తున్నాడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా పొలాలు పదునై వానల్లేవు. గత ఏడాది ఇదే సమయానికి 50 శాతం పంట పొలాలు సాగయ్యాయి. ఈ ఏడాది ఈ ఊసేలేదు. ఓ వైపు కాలం కరిగిపోతుండగా, మరోవైపు వానలు లేకపోవడంతో రైతులు కలవరపడు తున్నారు. జూన్‌లో సాధారణం కన్నా 22.1 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. జూలైలోను సాధారణ వర్షపాతానికి చేరుకోలేదు. ఈ నెలలో ఇంతవరకు ఎక్కడా చినుకు పడిన దాఖలాల్లేవు. విత్తు మొలకెత్తి పదునే లేదు. సాధారణంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పంటలు ముందుగానే సాగు చేస్తారు. ఈ ఏడాది స్వర్ణముఖి నదిలో చుక్క నీరు లేకపోవడంతో రైతుల పంట పొలాలు బీడు భూములుగా మార్చుకొని వరుణుడి రాక కోసం వేచి చూస్తున్నారు. ఆలస్యంగా సాగు చేస్తే దిగుబడి మీద ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు సాగైన కొద్దిపాటి విస్తీర్ణం కూడా బోర్ల కింద సాగులోకి వచ్చిందే కావడం గమనార్హం. రాబోయే 15 రోజుల్లో సరైన వర్షం పడకపోతే సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## స్వర్ణరథంపై విహరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అలంకార భూషితుడైన సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాధుడు స్వర్ణరథంపై ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకట హర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మిరమిట్లు గొలుపుతున్న స్వర్ణరథంపై వుంచి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## వెంకయ్యనాయుడు ఆత్మీయ పలకరింపు

తిరుపతి,ఆగస్టు 4ప్రభాతవార్త:



ఉపరాష్ట్రపతిగా పదవీవిరమణ చేసిన తరువాత ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం తొలిసారిగా తిరుపతికి వచ్చారు. నగరశివార్లలోని ఓ హోటల్‌లో విశ్రాంతి తీసుకున్న వెంకయ్యనాయుడును కలసిన బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాధరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హరిప్రసాద్, అజయకుమార్, పొనగంటి భాస్కర్‌లను ఆయన ఆత్మీయంగా పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడును బిజెపి నాయకులు గజమాలతో సన్మానించి దుశ్శాలువతో సత్కరించారు.

## ప్రభుత్వ పాఠశాలలకు శ్రీసిటీ రాకవర్త్ పరిశ్రమ వితరణ

**-1.5 లక్షల విలువైన 25 పెడస్టల్ క్యాబినెట్స్ పంపిణీ**

సత్యవేడు, ఆగస్టు 4 ప్రభాతవార్త:



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో తమ కార్పోరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా శ్రీసిటీలోని రాకవర్త్ పరిశ్రమ పరిసర మూడు ప్రభుత్వ పాఠశాలలకు 1.5 లక్షల విలువ చేసే 25 పెడస్టల్ క్యాబినెట్స్‌ను వితరణగా ఇచ్చారు. ఇవి ఆఫీస్ డాక్యుమెంట్స్, వస్తువులు భద్రపరిచే ర్యాకులుగా ఉపయోగడుతాయి. ఇరుగుళం జడ్పీ హైస్కూల్‌కు 11, మాదనపాళెం జడ్పీ హైస్కూల్‌కు 11, చెరివి ప్రాథమిక పాఠశాలకు 3 ర్యాకులు పంపిణీ చేశారు. శుక్రువారం రాకవర్త్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ రాయన, శ్రీసిటీ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు వితరణ సామాగ్రిని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాంతంలో విద్యావసతులు మెరుగుదలకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామంటూ శ్రీరామ్ రాయన ఈసందర్భంగా పేర్కొన్నారు. వితరణ పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఉపాధ్యాయబృందం, విద్యాప్రమాణాల పెంపుకు శ్రీసిటీ ఫౌండేషన్, పరిశ్రమల యాజమాన్యాలు అన్ని విధాలుగా అందిస్తున్న చేయూలను ప్రశంసించారు.

## దందోలును పరామర్శించిన మాజీ ఎంఎల్‌ఏలు:

శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 4 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి రాజకీయాల్లో కీలకంగా వ్యవహారించి తొట్టంబేడు మండలాన్ని నడిపిన దందోలు భక్తవత్సల రెడ్డిని శుక్రవారం మాజీ ఎంఎల్‌ఏలు ఎస్‌సివి నాయుడు, సత్రవాడ మునిరామయ్యలు పరామర్శించారు. ప్రస్తుతం డిబిఆర్ ఆసుపత్రి అధినేతగా ఉన్న దందోలు భక్తవత్సలరెడ్డి గతంలో సుమారు 30 సంవత్సరాల పాటు తొట్టంబేడు మండలాన్ని నడిపించారు. జడ్పిటిసిగా సీడ్స్ డైరెక్టర్‌గా భక్తవత్సలరెడ్డి సమర్థవంతంగా పని చేసారు. ఆయన గత కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధ పడుతున్నారు. తొండమనాడులోని ఆయన నివాసానికి వెళ్ళి మాజీ శాసనసభ్యులు పరామర్శించారు. వారితో పాటు భాస్కర్‌నాయుడు, సత్రవాడ ప్రవీణ్‌లు ఉన్నారు.

## వాసవి అమ్మవారికి లక్ష తులసీ దళ పూజలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తిలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం లక్ష తులసీ దళాలతో విష్ణు సహస్రనామం పారాయణ కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు బారీ సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తి పారవశ్యం కనబడింది.అధిక శ్రావణ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తామని వివరించారు. మహిళా భక్తులకు సదుపాయాలు కల్పించారు.